

# మనస్సు తమస్సు

జె. వి. భూపతిరాజు

*పట్టని నిద్రని పట్టించుకోడం అనేది-అసంభవమని - నాకు తెలుసు. కాని నిద్రపోయే కాలంలో మేలుకొని చెయ్యాదగినది ఏముందిగనుక ?*

పక్కమీంచి లేచాను.

చంద్రుడు - పున్నమి చంద్రుడై వుంటాడు - తన వెన్నెలనంతా వెదజల్లు తున్నాడు. పక్కన మంచంమీద పడుకున్న రాధకేసి చూశాను ఆమె ముఖంమీద కిటికీ లోంచి వచ్చిన చంద్రకాంతి పడి. వింత అందాన్ని తెచ్చి పెడుతోంది. ఫ్యానుగాలికి ఆమె ముంగుర్లు నుదుటిని ముద్దుపెట్టు కుంటున్నాయి. ఆ వాతావరణం చూసేసరికి రాధని వెంటనే నిద్రలేపి "రాధా - నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పా లనిపించింది.

కాని అందులో ఒక చిక్కుంది.

రాధతో అలా అంటే. "ఏమిటా వేళా కోళం.-నిద్ర లేవగొట్టి ఏమిటా ప్రకటన ? మీరు నన్ను ప్రేమించడం లేదని నే నన్నానా ? నన్ను గాకుండా యింకెవర్న యినా ప్రేమిస్తే నే నూరుకుంటానా ? మీకే మైనా వెర్రా" అని ఆలనగా చీవాట్లు పెడు తుంది.

ఆమె తిట్లు నాకు హాయిగా వుంటాయి. ఆఫీసులో చచ్చీచెడి పనిచేసి ఇంటికి వచ్చి రాధచేత మెత్తని రెండు చివాట్లు తింటే ఆ అలసటపోయి కొత్త హుషారు వస్తుంది.

అయినా తిట్లు తినడానికి ఆమెను లేప బుద్ధికాలేదు. నాకు నిద్రపట్టని కారణం వేరేవుంది. తలుపు తెరుచుకుని డాబామీదకు వచ్చి పిట్టగోడ మీద కూర్చున్నాను. పున్నమిచంద్రుణ్ణి చూస్తుంటే పూర్వపు సంఘటనలు మనస్సులో తిరుగుతున్నాయి.

సాయంత్రం సినిమాకు వెళ్ళకపోయినా బాగుండేదనుకున్నాను. సినిమాకి వెళ్ళినా, ఆ సినిమాకే వెళ్ళకపోయినా బాగుండును. అని సరిదిద్దుకున్నాను. అదే సినిమాకు వెళ్లా లని పట్టుబట్టిన రాధమీద కోపం వచ్చింది. రాధనులేపి. ఇంకెప్పుడు అలా మంకుపట్టు పట్టకు. భర్తకు ఎదురుచెప్పకు అని హెచ్చ రించా లనిపించింది. కాని అది అయ్యే పని కాదు. రాధతో గొంతు చించుకుని చెప్ప క్కరలేదు. ఎంత సున్నితంగా చెబితే అంత త్వరగా అర్థం చేసుకుని పశ్చాత్తాపపడే సంఘటనయితే, పశ్చాత్తాపపడుతుందికూడా.

ఇంతకూ ఆ సినిమాకి వెళ్ళి సుశీలని చూడకపోతే యీ రాత్రి ఆలోచించవలసిన పనిలేదు. చక్కగా నిద్రపోయేవాణ్ణి ! కాని దైవం ప్రతి చిన్న పనిలోకూడా అడ్డువస్తా డని వేదాంతులు తీరి కూర్చుని అనరుకదా !

సుశీల !

అవును, సుశీల !

నా మనస్సు ఐదు సంవత్సరాలు వెనక్కి పరుగెట్టింది.

ఐదే ళ్ళయివుంటుంది.

అవి నేను యం కామ్. ఆఖరి సంవ త్సరం చదివేరోజులు. చదువులో నే గాకుండా, నాటకాల్లో వేషాలెయ్యడమన్నా. పాటలు పాడడమన్నా విపరీతమైన ఆసక్తి వుండేది. ఆమాటకొస్తే యిప్పటికే ఆసక్తి వుంది. ఆ 'శక్తి' వుందో లేదో తెలుసు కునే అవకాశంమాత్రం లేదు.

ఆనాడు ఒక బ్రహ్మాండమైన నాటకం వేశాము. నాటకంలో నేను బాగా నటించానని నా శ్రేయోభిలాషులే గాక, ముక్కూ ముఖం తెలియనివారు కూడా అన్నారు. ప్రఖ్యాత సినిమా నటుడిని పిలిచా రానాడు. ఆయనే నాకు వెండిపతకాన్ని బహూకరించారు. నాటకం అయిపోగానే అంతా వచ్చి నన్ను తెగపొగిడారు. గర్వంతో నాశరీరం పుబ్బింది. అంతా వెళ్ళిపోతుంటే నేను చేతులు జోడించి దేశనాయకుల పక్కీలో నమస్కరించాను. వాళ్ళు వెళ్ళిపోయాక, హుందాగా గ్రీన్ రూములోకి నడిచి, నాటకంలో నాపాత్ర పాడిన పాట పాడుకుంటూ మేకప్ చెరుపుకోడం ఆరంభించాను. ఇంతలో తలుపు శబ్దం అయ్యింది. ఎవరో మా పటాలంలో వాళ్ళు అయివుంటారని "రావచ్చు" అన్నా నా ముఖానికి నూనె రాసుకుంటూ, తలుపు తోసుకుని వచ్చిన శబ్దానికి, నూనె తుడుచుకుని చూశాను.

కళ్ళు జిగేల్ మన్నాయి.

ఎవరో ఓ అమ్మాయి-కాదు మెరుపుతీగ-కిలకిల నవ్వుకుంటూ లోపలకు వచ్చి "నమస్కారమండీ" అంది. నేను లేచి, "నమస్కారమండీ" అన్నాను నూనె చేతులు కలుపుతూ. అంత అందమైన అమ్మాయి వచ్చిన సమయంలో ముఖానికి నూనె పట్టించుకుని, చెరిగిన రంగుతో రాక్షసుడిలా వున్న నా అవతారం తలుచుకుని, నన్ను నేనే వందతిట్లు తిట్టుకున్నాను.

"కూర్చోండి" అన్నాను తేరుకుని.

ఆమె కూర్చుంది.

"ఎవరు కావాలండీ" అన్నాను అంతకన్నా మరోవిధంగా పలకరించడం తెలియక.

"ఎవరో కావలసివస్తే మిమ్మల్ని వెతుక్కుని రావడం ఎందుకు?" అందామె నవ్వుతూ.

ఆమాట వినేసరికి నా శరీరం గగుర్పొడిచింది. మళ్ళీ అవే మాటలు యింకోసారి అంటే బావుండు ననిపించింది. ఇంతలో ఆమె మాట్లాడడం ప్రారంభించింది.

"మీరు వేసిన నాటకం యిదివరకోసారి చూద్దామని ప్రయత్నించాను. కాని, కుదరలేదు. ఆ భాగ్యం యివాళ కలిగింది. మీ నటన నన్ను ఎంత ఆనంద పెట్టిందో చెప్పలేను. నిజంగా మీకు పూర్వజన్మ అదృష్టం వుంది. లేకపోతే అంత చక్కని నటన రాదు." అంది చక్కని గొంతుతో.

నా కేమనాలో తెలియలేదు. చచ్చి చెడి, ముఖానికి పట్టించుకున్న నూనె తుడుచుకున్నాను ఆవిడమాటలు వింటూనే.

"నేను కూర్చుంటాను. మీరు మీ పని కానివ్వచ్చు" అందామె తన గోళ్ళు చూసుకుంటూ.

నేను ముఖం కడిగేసుకుని, క్రాపు ఎగరేసి దువ్వుకుని. డబ్బాలో చాలాభాగం పౌడరు ముఖానికి రాసేసుకుని, బట్టలు మార్చుకుని వచ్చేవరకు ఆమె అలా కూర్చునేవుంది.

"మన్నించండి. చాలా ఆలస్యం చేశాను" అన్నాను; అలా అనాలని ఒక ఆనవాయితీ వుండడంవల్ల.

"ఆలస్యం చేసినట్టు నా కనిపించలేదు" అందామె గాజులు సవరించుకుంటూ.

"చాలా థాంక్స్. నాటకం చూడడమే గాకుండా స్వయంగా వచ్చారు శ్రమతీసుకుని. నా నటనలో ఏవైనా లోపాలుంటే విమర్శించి చెప్పండి" అన్నాను.








ఆమె ఏం చెబితే అది చెయ్యా లనిపించింది. గంగలో దూకమన్నా దూకేద్దామన్నంత వుత్సాహం కలిగింది.

ఆమె నామాటలకు చిన్నగా నవ్వుతూ, "చొరవ తీసుకుని చెబుతున్నందుకు ఏమీ అనుకోరుకదా!" అంటూ ప్రారంభించింది.

"ఏమీ అనుకోను. పైగా మీ సలహాలు శిరోధార్యాలు" అన్నాను కుడిచెయ్యి నెత్తి మీద పెట్టుకుంటూ.

ఆమె నా చొరవకి కొంచెం సిగ్గుపడి, ఆ జాతికే చెందిన నవ్వు నవ్వుతూ, "మీరు నటించేటప్పుడు ముక్కుపుటాలు ఎగరేస్తారు. కోపం నటించాల్సిన సీనుల్లో బాగున్నా మిగతావాటిలో బాగుండదని నావుద్దేశ్యం. తప్పు అయితే కావచ్చు" అంది.

"రేపటినుండి ఇవాళనుంచి మీ సూచన నూరుపాళ్ళు పాటిస్తాను" అన్నాను నేను ముక్కుపుటాలు ఎగరవేయబోయి, నిభాయించుకుంటూ.

ఆమె లేచి నిలబడి "వస్తాను. నమస్తే" అంది.

నేనూ లేచి నించుని "మీ కభ్యంతరం లేకపోతే నా కారులో దింపుతాను" అన్నాను ఆమె అడ్రసు తెలుస్తుందనే ఆశతో. ఆమె అంగీకార సూచకంగా తల వూపింది. నేను ఛెంగున గంతేసి, మిగతా వారితో "వెళ్ళొస్తా"నని చెప్పి, బయల్దేరాను. ఆమె నన్ను అనుసరించింది. నేను స్టీరింగు ముందు కూర్చున్నాను. ఆమెకూడా డోర్ తెరచి ముందుసీటులోనే కూర్చుంది. కారు స్టార్ట్ చేశాను.

ఆమె ఎటుపోవాలో చెప్పసాగింది. నేను మధ్యమధ్యలో ఆమెకేసి చూస్తూ, ఆమె చెప్పే మాటలు వింటున్నాను. ఆమె తను యం. బి. బి. యస్. ఆఖరి సంవత్సరం చదువుతున్నానని చెప్పింది.

నా గుండె గుభేలుమంది. నా యమ్. కామ్. ని గుప్‌చిప్‌గా దాచేస్తే మంచిదను కున్నాను. కాని, ఆమె అడగడంవల్ల చెప్పక తప్పలేదు.

"అంత చదువుకునికూడా మీరు చక్కని సంగీతం, చక్కని నటన ఎలా అభ్యసించారో ! చాలా మెచ్చుకోతగ్గ విషయం" అందామె.

"ఆ ! ఏవుంది అంత పెద్ద" అన్నాను.

"భలేవారు. మిమ్మల్ని చూస్తుంటే నాకెంత గర్వంగా వుందో" అందామె

నే నామెకేసి చూశాను. ఆమె కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. చటుక్కున ఆమె చేతిని నా చేతిలోకి తీసుకుని, "నిన్ను నేను ప్రేమిస్తున్నాను" అందామనిపించింది. కానీ అలా అన్నందువల్ల యీ పరిచయం ఎక్కువ విరగచ్చు. దవడ పళ్ళురాలినా అంత ఆశ్చర్యంవుండదు-అనిపించి నిభాయించుకున్నాను.

కారు మరో మలుపుతిరిగి, ఆమె ఆజ్ఞను పాటించి, ఒక యింటిముందు ఆగింది. నే నా యింటిని, నంబరును మనస్సులో మననం చేసుకున్నాను.

"నమస్తే వుంటాను" అందామె రెండు చేతులూ కలిపి నాకు నమస్కరిస్తూ.

నేను రెండుచేతులూ జోడించాను.

ఆమె మెరుపులా వెళ్ళిపోయింది.

కారు నీరసంగా కదిలింది.

ఆమె పేరు అడగడం మర్చిపోయినందుకు నన్ను నేనే అష్టోత్తర శత తిట్లు తిట్టుకున్నాను. ఇంటికి వచ్చి పడుకున్నానుగాని, నిద్ర పట్టలేదు. ఆమె ముక్కుపుటాలు ఎగరవెయ్య వద్దంది. అవును వచ్చినా ముక్కు పుటాలు ఎగురవెయ్యకూడదనుకున్నాను. అద్దంలో నా విగ్రహం చూసుకున్నాను. నాసిన శనగలా వుబ్బింది నా శరీరం, నాలుగైదు కోణాల్లో చూసుకుని, "భేష్" అనుకున్నాను.

ఆ మర్నాడు నేను కారు వాళ్ళింటి ముందు ఆపేసరికి ఆమె బయటకు వచ్చింది. నే నాశ్చర్యపోయి, "నేనిక్కడ వస్తానని మీ కెలా తెలుసు ?" అనడిగాను

"అలాటి ప్రశ్నలకు సమాధానం చెప్పడం కష్టం" అందామె జడకుచ్చులు గిర్రున తిప్పుతూ. నేను నవ్వేశాను. ఆమె కూడా నవ్వి, కారులోఎక్కి "మీ యిష్టం వచ్చినచోటుకు పోనివ్వండి" అంది.

"బీచ్‌కి వెళ్దామా ?"

"మీ యిష్టం."

"నా యిష్టప్రకారం కారుని అడయార్ బీచికి పట్టించాను. మధ్యమధ్య ఆమె ఏవేవో మాట్లాడుతోంది. ఆమె మాట్లాడుతున్నపుడు ఆమెవంక చూడడంవల్ల కారు గతితప్పి అధోగతిపాలయి, మమ్మల్నికూడా చేస్తుందేమోనని అట్టే చూడడం మానేశాను.

బీచ్‌కి చేరగానే ఆమె ఆనందంతో కారు లోంచి ఒక్క గంతువేసింది. నేను అద్దాలు పైకెత్తి, కారుతాళం వేసేసరికల్లా ఆమె సముద్రందగ్గరకు వెళ్ళి నిలబడింది. లాంగ్ షాట్‌లో ఆమెను చూసేసరికి నా వొళ్ళు పులకరించింది.

నల్లని పట్టుచీర, నల్లరవిక, నల్లగాజులు, నల్లటి చెప్పులు వేసుకుంది. ఆ నలుపువల్ల ఆమె శరీరంరంగు మరింత మెరుస్తోంది. నే నామెను చేరేసరికి "మీరు చాలా నెమ్మదిగా నడుస్తా రనుకుంటాను. కారున్నవాళ్ళకి నడక చేతగాదు" అంది నవ్వుతూ.

ఆమె మాటకు ఎదురుచెప్పబుద్ధి కాలేదు. నవ్వేసి వూరుకున్నాను. ఆమె నీటిలో గంతులువేసింది. పీతల్ని చూసి అరిచింది. పీత శరీరభాగాలు వర్ణించి చెప్పింది. చివరికి నేను నిన్నరాత్రి అనుకున్నది గుర్తుకువచ్చి, "అన్నట్టు మీ పేరు చెప్పనైనాలేదు" అన్నాను నేను. ఆమె అసలే పెద్దవైన తన కళ్ళను మరింత పెద్దవిగా చేసి చూస్తూ, "మీరడగందే ! పైగా అబ్రహాం లింకన్ ఏమన్నాడో తెలుసా ?" అంది.

"ఏమన్నా ఫరవాలేదు. మీపేరు చెప్పద్దని అతను అనుంటాడనుకోను. ఒకవేళ వద్దన్నా మీరు చెప్పరని అనుకోను" అన్నాను నేను.

"నాపేరు సుశీల" అందామె కళ్ళు క్రిందికి దించుకుని.

"సుశీల ! !" అన్నాను నేను.

"ఏం ? పేరుచప్పగా వుందా ?"

ఆమెకేసి చూశాను. నాకేసి వింతగా చూస్తోంది ఆమె.

"పేరా ! నేను మీకు ఏపేరు వుండాలని వూహించుకున్నానో అదేపేరు చెప్పారు." అన్నాను ఆమె కళ్ళల్లోకి చూస్తూ. ఆమె కళ్ళు దించుకుంది.

రానురాను వాళ్ళింటికికూడా వెళ్ళడం ప్రారంభించాను. వాళ్ళమ్మమ్మగారిని పరిచయంచేసింది. ఆవిడకూడా అనుమానాలున్న పురాణకాలపు మనిషిలా కనిపించలేదు. చాలా చనువుగా మాట్లాడేది. ఇలా నెలలు గడిచిపోయాయి. సుశీల పరీక్ష లయిపోయాయి. ఒక్కొక్కసారి ఆమెయింటికి వెళ్ళినపుడు ఆమె వుండేదికాదు. వాళ్ళమ్మమ్మగారితో మాట్లాడి వచ్చేసేవాడిని.

• • •

ఆలోచనలు నిలిపి, పిట్టగోడ దిగాను. ఆపైన గతం గుర్తు తెచ్చుకోడం నాకు యిష్టం లేకపోయింది. లోపలకు వచ్చి పక్కమీద వాలాను. రాధకేసి చూశాను. రాధ నిద్రలో నవ్వుకుంటోంది కాబోలు పెదిమలు కదిలాయి. రాధను గమ్మునలేపి నిద్రలో నవ్వురావడానికి కారణం ఏమిటో చెప్పమని అడగాలనిపించింది. కాసేపు నిద్రపోతున్న ఆమెకేసి అలాగే చూశాను అనక, నా పక్కమీంచి వంగి రాధ భుజం తడుతూ, "రాధా, రాధా" అన్నాను

"ఆ ...ఆ" అంది వెంటనే లేస్తూ. రాధది కోడి కునుకు. చీమ చిటుక్కుమన్నాసరే లేచి కూర్చుంటుంది.

---

● ఒకడు అర్ధరాత్రివేళ అర్జంటుగా డాక్టరుకి ఫోనుచేసి: "అయ్యా ! బొత్తిగా నిద్రపట్టడం లేదు. మీరేదన్నా చెయ్యాల్సిందే" అన్నాడు.

డాక్టరు: "ఆగండి, జోలపాట పాడుతాను."

లేచి "ఆ....ఏమండీ, పిలిచారా" అంటూ తలపక్కనున్న స్విచ్ వేసింది. గదంతా దిక్కుమాలిన వెలుతురు వ్యాపించింది.

"ఏవిటి? అలావున్నారేవిటి? నిద్ర పోలేదా?" అనడిగింది నా ముఖం చూస్తూనే.

"ఏం?" అన్నాను నేను క్రాపు సరిచేసుకుంటూ.

"ఏం ఏవిటి? మీ ముఖమే చెప్తోంది. ఏవి టాలోచిస్తున్నారు?" అంది మంచం మీంచిలేచి నా మంచంవద్దకు వస్తూ.

"ఏంలేదు-ఏదో ఆఫీసు విషయం" అన్నాను తప్పించుకోడానికి లేపినకారణం చెప్ప బుద్ధికాలేదు.

ఆమె బాధగా నవ్వింది.

"మీరు ఆ అఫీసులో గుమాస్తావా లేక యజమానా? నేనే మీ స్థితిలోవుంటే అసలు ఆఫీసుకు వెళ్ళేదాన్నేకాదు. పని యెక్కువయితే మరో పదిమందిని వెయ్యండి. అంతేగాని మీ ఆరోగ్యం పాడుచేసుకుంటే ఎలా?" అంది నా నుదురుమీద చెయ్యి వేస్తూ. "అబ్బే జ్వరంలేదు." అని చిన్నగా గొణిగింది.

"రాధా! మనం యజమానులం గనుకే యింత ఆలోచించాలి. లేకపోతే నాకేంపని" అన్నాను ఆఫీసుగురించి ఆలోచిస్తున్నానని చెప్పిన విషయాన్ని బలపరుచుకుంటూ. రాధ నామాటని సుతరాం వొప్పుకోనట్టు తలతిప్పి, "కాదనను కానీ యిలా అనవసరంగా ఆలోచించే అంత ఏమొచ్చింది? హాయిగా నడుస్తోంది కదా! రాత్రి తెల్లవార్లూ ఆలోచించడంవల్ల లాభం ఏవిటి?" అంది.

"అవును. లాభంలేదు. పడుకుంటాను. లైటార్పెయ్" అన్నాను పక్కమీదవాలుతూ. రాధ లైటార్పేసి పడుకుంది. నాకు నిద్ర పట్టదని ముందే తెలుసు. రాధ నిద్రపోయిందని తేల్చుకోగానే లేచి మళ్ళ డాబామీదికి వచ్చాను. ఆ పక్కనున్న పడకకుర్చీ వెన్నెల్లోకి లాక్కుని కూర్చున్నాను. గతం గురించి ఆలోచించకూడ దనుకున్నకొద్దీ ఆ ఆలోచన విజృంభిస్తుంది. నా మనస్సు గతంలోకి వెళ్ళిపోయింది.

రానురాను నేను పొద్దునపూట కూడా వాళ్ళింటికి వెళ్ళేవాడిని. అలా వెళ్ళే రోజుల్లో ఎవరో ఒకతను వాళ్ళింటికి రావడం, పోవడం చూశాను. ఆరోజు నేను వెళ్ళేసరికి అతను, సుశీల హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. సుశీల అతన్ని నాకు పరిచయం చేసింది. అతను డాక్టర్ మోహన్‌ట! ఆమెతోనే చదివాడట. ముగ్గురం కబుర్లలోకి దిగాము. అతను మరీ వాగుడుకాయలా కనుపించాడు. సుశీల అతని మాటలకు వుత్సాహంతో నవ్వడం ప్రారంభించింది. నాకు చిరాకు కలిగింది. అసూయకూడా కలిగింది. ఆ మోహన్ నామీద గుప్పెడు పొడుగున్నాడు. నాకన్నా కొంచెం బలంగా వున్నాడు. పైగా డాక్టరు చదివాడు. కాస్తో కూస్తో వున్నవాడే అయి వుండా లనిపించింది. రెండు గంటలు కబుర్లయ్యాక 'వెళ్ళొస్తా' అని నేను లేచాను. మోహన్‌కూడా లేచి నిలబడి "నేనూ సెలవు తీసుకుంటాను" అన్నాడు. సుశీల అతన్ని కాస్సేపు వుండమని బ్రతిమాలింది. నన్ను కూడా ఆగమంది. కాని, ముందతనికి ప్రాధాన్యం ఇవ్వడంవల్ల నాకు కోపం ఎక్కువయింది. ఇక అక్కడ ఒక్కక్షణం కూడా వుండబుద్ధికాలేదు. బయటికి వచ్చేశాను. నా కారుపక్కన మరో కారువుంది. దానిలో కూర్చున్న డ్రయివరులాంటివాణ్ణి, "కారెవరిది?" అని అడిగాను. "మోహన్ గారిది" అన్నాడతను. నాబుర్ర తిరిగింది. అతనికీ కారుంది! ఇక అన్ని విషయాల్లోనూ అతనికన్నా నేను హీనమే! నామీద నాకే అసహ్యంవేసింది. అతన్ని పీక నులిపేసి చంపేద్దామనుకున్నాను కాని అది కార్యరూపం దాల్చలేదు-అతనుకూడా నా అంత తరుచుగా వాళ్ళింటికి రావడం ప్రారంభించాడు. సుశీలతో అతను మాట్లాడుతుంటే ఆమె తన రెండుచేతులను చెంపల కానించి, అతని కళ్ళల్లోకి చూస్తూ వూకొట్టేది. అలాటి సమయాల్లో నేను ఏ పేపరు చాటునో ముఖం దాచుకునేవాడిని. సుశీలకి మాటలు వినడంఅంటే తగని యిష్టం. మోహన్‌కి కబుర్లుచెప్పడం వుంటే, తిండి-తిప్పలుకూడా అక్కర్లేదు. నాకు కబుర్లు చెప్పడమూ రాదు, వినే ఓపికాలేదు. ఇక నాగతి అంతే! రానురాను సుశీలని చూడాలనే వుత్సాహం నాలో సన్నగిల్లడం ప్రారంభించింది. చాలాసార్లు వాళ్ళింటికి వెళ్ళి బయట అతనికారు చూసి, వెనక్కు వచ్చేవాడిని.

సుశీల నా సొత్తు, పరాధీనం కాకూడదు. కావడానికి వీల్లేదు అనే పట్టుదల నాలో ఎక్కువయింది. ఈ ఆలోచనవల్ల ఒకవారం వాళ్ళింటికి వెళ్ళడం మానేశాను. ఒకనాడు ఆమె నా ఆఫీసుకు ఫోనుచేసి, రావడం మానేసిన కారణం అడిగింది. ఏమీలేదని చెప్పినా నమ్మలేదు. సాయంత్రం యింటికి రమ్మని బ్రతిమాలింది. అలాగే అన్నాను. సాయంత్రం యీ సంగతి తాడోపేడో తేల్చెయ్యాలని బయల్దేరాను. ఇంటికి వెళ్ళేసరికి ఆమె లేదు. డాక్టర్ మోహన్, ఆమె ఎక్కడికో వెళ్ళినట్టు వాళ్ళమ్మమ్మ చెప్పింది. నా బుర్ర గిర్రున తిరిగింది. కేవలం నన్ను అవమానపరచడానికే రమ్మందా అన్న అనుమానం కలిగింది. తిన్నగా కారెక్కి మెరీనాబీచ్‌కి చేరాను. బీచ్‌లో అటూయిటూ ఆలోచిస్తూ తిరుగుతుండగా నా కంటికి ఓ జంట కనుపించింది. మరికాస్త తేరపార చూశాను. నా వొళ్ళు ఝల్లుమంది. శరీరం చల్లబడి పోయింది.

వాళ్ళిద్దరు సుశీలా మోహన్‌లు!

పరుగున వెళ్ళి ఆ మోహన్ జుట్టు పీకేసి, ప్యాంటు, చొక్కా చింపేసి, పైతో వాడి మెడ బిగించేసి, దవడపళ్ళు రాలగొట్టేద్దామనిపించింది. కాని, అది అవివేకం. వాళ్ళను వెంబడించి, వాళ్ళు ఏవిధంగా

---

*● వృద్ధుడైపోతున్న మావో, తనను రెడ్‌స్క్వేర్‌లో సమస్త గౌరవ లాంఛనాలతో సమాధి చేయడానికి గనక ఒప్పుకుంటే, ఈ క్షణంలోనైనా, రష్యాల మధ్య విరోధాలను అంతం చేయించగలనని కృశ్చెవ్‌కు వ్రాశాడట.*

*దీనికి రష్యాప్రధాని జవాబు: "మీరు వెంటనే రండి. అలాగే చేస్తాము."*

*("శాటర్ డే రివ్యూ")*

ప్రవర్తిస్తారోచూసి, ఒకవూహ కల్పించుకోవచ్చని వాళ్ళను వెంబడించడం ప్రారంభించాను. వాళ్ళు ఒకళ్ళకొకళ్ళు చాలా దూరంగా నడుస్తున్నారు. సుశీల కొంచెంముందు నడుస్తోంది. అతను ఆగి ఏదో వర్ణించి చెబుతుండడంవల్ల, ఆగి వెనక్కు తిరిగింది. ఆ తిరగడంలో ఆమెకు నేను కనబడ్డాను. నాకేసి వచ్చేసింది. వస్తూనే, "వెరీ సారీ! సాయంత్రం మూడింటికి ఆసుపత్రికి వెళ్ళాము, అక్కడ చాలా ఆలస్యమైంది. ఒక కేసువిషయం మాట్లాడుకుంటూ యిద్దరం యిలా వచ్చాము. ఆపరేషను అయింది. కానీ, ఆ పేషంటుమాత్రం బ్రతకలేదు" అంది గబగబా.

"ఆహా" అన్నాను నేను.

ఇంతలో అతనుకూడావచ్చి అదే సంగతి చెప్పి, "సుశీల మిమ్మల్నిగురించే చెబుతోంది" అన్నాడు. 'నోర్మొయ్యవోయ్' అందా మనుకున్నానుగాని, బాగుండదని వూరుకున్నాను. ముగ్గురం యిసకలో కూర్చున్నాము. ఐస్‌క్రీమ్ వచ్చేసరికి మోహన్ కొన్నాడు. వాడు కొన్న ఐస్ నాకు తినా లనిపించలేదు. చేయి జారినట్టు నటించి ఐస్ ఇసకలో పడేసి, నా డబ్బుతో మరోటి కొన్నాను. మరికాస్సేపు కూర్చొన్నాక మోహన్ లేచి వెళ్ళవస్తానన్నాడు.

"మంచిది" అన్నాను నేను తొందరగా.

మోహన్ వెళ్ళిపోయాక నేను చెప్పదలచుకున్న విషయాలు ఎలా చెప్పాలో ఆలోచించుకుంటుంటే సుశీలే మాట్లాడి "నే నొక విషయం మీతో చెప్పాలి" అంది.

"నేను వచ్చేవారం మా వూరు వెళ్ళిపోతున్నాను. మా అమ్మమ్మనుకూడా తీసుకువెళుతున్నాను. మన వివాహవిషయం మా తలిదండ్రులతో అమ్మమ్మ మాట్లాడుతానంది. మీ కిష్టమేకదా? మా నాన్నగారు వస్తారు మీ యింటికి. వాళ్ళ లాంఛన ప్రకారం జరగవలసినవి వుంటాయికదా! ఏమంటారు?" అంది.

నాకు ఆశ్చర్యంవేసింది. సుశీలకి నన్ను వివాహంచేసుకోవాలనే వుద్దేశం నిజంగా వుందనే నమ్మకం నాకు కలగలేదు.

"డాక్టర్ మోహన్ మంచి సంబంధమేమో" అన్నాను యిసకలో గీతలుగీస్తూ. ఆమాట వింటూనే సుశీల చీత్కారంచేసింది. ఆమె కళ్ళలో నీరు గిర్రున తిరిగింది.

"మీరింత నీచంగా వూహించగలరని నేను కలలోనయినా వూహించలేదు." అంది బాధగా.

"ఊహించడం కాదు, నానమ్మకం అది. నేను కేవలం అతనికి ఎందులోనూ సరిపోను. నాకు చాలా డబ్బువుందనుకుంటే - అతనికీవుంది. ఇక నాలో ఏఘనతాలేదు. ఏ స్త్రీకూడా చూస్తూ చూస్తూ ఒక అల్పుడిని ప్రేమించి పెళ్ళాడదు. పెళ్ళాడాక అల్పుడయితే విషయం వేరు" అన్నాను.

ఆమె తలవంచుకుని కూర్చుని వుంది. కన్నీరుమాత్రం చీరకుచ్చెళ్ళమీద పడడం కనిపించింది. నాకు తృప్తి కలగలేదు. సుశీల భోరున ఏడ్చినా, నామనస్సు శాంతించదేమో! కాని భోరున ఏడిస్తే చూసి, ఆనందించా లనిపించింది.. మాటలతో ఆమెను ఎంతవరకు బాధపెట్టగలనో అంతవరకు బాధపెట్టి తీరాలనుకున్నాను. ప్రారంభించాను.



"నువ్వు నా దాని వనుకున్నాను. కానీ అది కేవలం నా భ్రమని తేలింది. నువ్వు ఆ మోహన్‌తో అంత చనువుగా మాట్లాడడం నా కిష్టంలేదు. లేదని చెప్పడానికి నే నెవర్ని-అవును. ఆ ప్రశ్నకు నేనే సమాధానం చెప్పుకోలేను." అన్నాను తాపీగా ఆమెవంక చూస్తూ.

ఆమె ముఖంపైకెత్తి నాకేసి చూసింది. ఆమె కళ్ళు ఎర్రగా తయారయ్యాయి. ఆమె ఆ స్థితిలో వుండడం నే నిదివర కెన్నడూ చూడలేదు. కళ్ళు తుడుచుకుంటూ "మీరు యింత సంకుచిత భావాలు కలవారని నేను ఎన్నడు అనుకోలేదు నా వృత్తి డాక్టరు వృత్తికదా? అతను-నేను కలిసి అప్పుడప్పుడు ఆసుపత్రికి వెళ్ళడం జరిగేది. మనిషి చక్కగా మాట్లాడుతాడు ..."

"చక్కగాకూడా వుంటాడు" అన్నాను నేను ఆమె మాటలకు అడ్డొచ్చి

"ఆ విషయం నేను ఎన్నడూ ఆలోచించలేదు. నాకు అవసరంకూడాలేదు" అందామె.

"అవసరంవస్తే ఆలోచిస్తావన్నమాట" అన్నాను.

"ఆ అవసరం రాదన్న నమ్మకం వుంది నాకు" అంది. ఆ మాటన్నపుడు ఆమె గొంతు చాలా స్థిరంగావుంది.

"ఇంతకీ నా మాటకి మీరు సమాధానం చెప్పలేదు" అందామె.

"నాలో ఏంచూసి నువ్వు నన్ను వివాహం చేసుకోదలచావో చెప్పగలవా?" అన్నాను.

"ఆ ప్రశ్నకి నేనేకాదు, చాలామంది చెప్పలేరు. నాకు బెండకాయకూర యిష్టం. అదెందుకే నీ కిష్టం అని అమ్మమ్మ అడుగుతుంది కానీ చెప్పలేను. అంత చిన్న విషయమే చెప్పలేకపోతే యింతపెద్ద విషయం ఎలా చెప్పగలను?" అందామె.

"అయితే యింకా కొన్నాళ్ళు నాకు టైమివ్వాలి. ఏ సంగతీ ఆలోచించుకోవాలి. నాకు ఆలోచన చెప్పడానికి తల్లీ తండ్రీ కూడా లేరుకదా! డబ్బుని ఆలోచన అడిగితే అది చెప్పలేదు" అన్నాను లేచి నుంచుంటూ. సుశీలకూడా లేచి నుంచుంది. ఇద్దరం ఇసకలో నెమ్మదిగా నడిచి, కారులో ఎక్కాము. ఆమెను ఆమె యింటిముందు దింపాను. ఆమె కారుదిగి, రెండు చేతులు జోడించి "ఉంటాను. మీ రాకకోసం ఎదురు చూస్తుంటాను. ఆవేశపడి బుర్ర పాడుచేసుకోకండి" అంది. "అలాగే" అన్నాను నేను.

నా కారు కదిలి, మలుపుతిరిగేవరకు అలాగే నిలబడివుంది. ఇంటికి వచ్చేసరికి నాకోసం నౌకర్లు ఎదురుచూస్తున్నారు. వాళ్ళకది మామూలు. మేనేజరుగా వుంటున్న మేనమామ "ఏంరా, అలావున్నావ్" అని పలకరించాడు. ఆయన దయామయుడు. నా ఆస్తిని, నన్ను పెద్దచేసినవాడు. ఆయనకే గనుక అమ్మాయివుంటే మాట అడ్డుచెప్పకుండా పెళ్ళిచేసుకుని వుండేవాడిని.

"ఏంలేదు, మామయ్యా" అన్నాను.

ఆయన అంతకన్నా ఎక్కువ పలకరించరు. నేను తిన్నగా నా రూములోకి వెళ్ళిపోయాను. ఆ రాత్రంతా నాకు నిద్రపట్టలేదు. సుశీలని గురించి ఒక నిర్ణయానికి రాలేకపోయాను.

రెండు రోజులు గడచాయి. ఆనాడు సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళాను. సుశీల యింట్లో సుమారు పదిమంది మగవాళ్ళున్న

ట్టున్నారు. లోపలకు వెడదామా, వద్దా అని సంశయించేలోగా సుశీలే నన్నుచూసి, "రండి రండి" అని పిలిచి వాళ్ళకి పరిచయం చేసింది. అంతా డాక్టర్లేట! వీళ్ళు దేశంలో రోగాలు నయం చెయ్యడానికా, లేక విస్తృతం చెయ్యడానికా అనుకున్నాను. అంతా వెళ్ళిపోయాక, సుశీలా, నేనూ డాబా మీదకువెళ్లాము. నేను మనస్సులో మాట్లాడబోయేది నిర్ణయించుకున్నాను. సుశీల చల్లని పానీయం నాకో గ్లాసుడు యిచ్చి, "మీరు ఏమని ఆలోచించుకున్నారు?" అంది.

"నా ఆలోచనలు నీమనస్సుకి నచ్చవని తెలుసు. అయినా అడిగావుగనుక చెబుతాను. నీకు వినడానికి తీరుబడి వుందనుకుంటాను" అన్నాను.

ఆమె మౌనంగా తల వూపింది.

నేను గొంతు సవరించుకున్నాను.

"నాకు కొన్ని ఆశయాలు, ఆశలు, ఆదర్శాలు వున్నాయి. వివాహాన్నిగురించి కొన్ని వూహలు వున్నాయి. నువ్విలా అందరితో కులాసాగా కబుర్లుచెప్పడం నా కిష్టం వుండదు. దాన్ని తప్పనలేను. కాని నాకు తెలియకుండా నా మనస్సు బాధపడుతోంది. నా స్థానంలో ఆ మోహన్‌నిగాని మరెవర్నిగాని నేను వూహించుకోలేను. నువ్వే నా దానివి. ఇవాళ గాకపోతే రేపు అవుతావు. ఆపాటికి యివాళనుంచే నా మాట మీద గౌరవం వుంచితే నీకు పోయేదేమీ వుండదు. నా మాట విని ఆ మోహన్‌ని, వాళ్ళని పలకరించకు. వాళ్ళని రానివ్వకు, వాళ్ళతో మాట్లాడకు. అంతే - అంతే" అన్నాను ఆవేశంతో.



ఆమె నిస్పృహగా నవ్వింది.

"మీ మనస్సు మరీ వికలంగా వుంది. ఇంతగా ప్రతిదానికీ మీరు బాధపడతారని అనుకోలేదు. కాని మీకు కోపం రాకుండా వుంటే ఒక్కటి అడుగుతాను" అంది.

"ఏమి టది?" అన్నాను కొంచెం విసురుగా.


"మా యింటికి వచ్చారు. మా వాళ్ళని పరిచయంచేశాను. మా వివరాలన్నీ తెలియజేశాను. నా కథంతా చెప్పాను. మా నాన్నగారి వుద్యోగం, ఆస్తిపాస్తులు చెప్పాను. కాని, మీరు ఒక్కనాడయినా మీ యింటికి రమ్మన్నారా? లేదు. రమ్మనలేదు. మీ కుటుంబ విషయంగాని, మరితర విషయాలు గాని చెప్పారా-లేదు. ఇన్ని విషయాలు మిమ్మల్నిగురించి నాకు తెలియకపోయినా మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమించాను. మీ పేరు, మీ కారు నెంబరు, ఫోను నెంబరు తప్ప మిగతా విషయాలు నాకు తెలియవు" అంటూ ఆగింది.

"ఈ వుపోద్ఘాత మంతా ఎందుకు?" అన్నాను నేను

"ఏమీలేదు. కాస్త నిదానించి, విశాలంగా ఆలోచించండి" అంది ఆమె ముక్తసరిగా.

"ఆలోచించలేను. నువ్వు నాదానివిగా కావాలంటే నే చెప్పినట్టు వినాలి. ఇదిగో నా వుంగరం నీ వేలికి తొడుగుతాను. మనిద్దరికి పెళ్ళి అయిపోయినట్టే అనుకుందాము. నువ్వు మీ నాన్నగారితోచెప్పు. ముహూర్తం పెట్టించు" అంటూనే ఎడమచేతి చిటికెనవేలి వుంగరం తీసి, ఆమెవైపు నడిచాను. ఆమె కంగారుగా ఒక్క గంతు వేసింది.






"మిష్టర్ రాజూ!" అంది కొంచెం స్థిరంగా.

నన్నారకంగా ఆమె ఎన్నడూపిలవలేదు. నేను నిలుచున్నచోటే వుండిపోయాను.

"ఈపద్ధతి నాకు బొత్తిగా నచ్చలేదు. ఆ రకం నాగరికతను నే నెన్నడు కోరను. మీకు మనసు ఏనాడో యిచ్చాను. దానిని రుజువు చేసుకోడానికి యీ వుంగరాలు తొడగడాలు అవి నాకు పనికిరావు. పెళ్ళయ్యే వరకు మీరు నా స్నేహితులక్రిందే లెక్క. అపైన చనువు యివ్వలేను" అంది.

నాచేతిలో వుంగరం నన్ను వెక్కిరించింది. చేతిలో వుంగరాన్ని తపీమని నేలకేసికొట్టి చరచర బయటికి వచ్చేశాను. ఆ మర్నాడు ఎవరో ఒకతను ఒక కవరు నాకు యిచ్చారని ప్యూను యిచ్చాడు. అందులో వుత్తరంవుంది. సుశీల తన తల్లిదండ్రులతో చెప్పి ముహూర్తం పెట్టిస్తానని, ఆవేశపడవద్దని రాసింది. కోపంతో ఆ వుత్తరం చింపిపారేశాను. మూడోనాడు వాళ్ళ నాన్నగారు వస్తే అసలాయన్ని చూడడానికే నిరాకరించాను. ఆయన వెళ్ళిపోయాడు. అంతే ఆనాటికి - మళ్ళీ యీనాటికి - సుశీలని చూశాను.

• • •

ఆలోచనలతో బుర్ర వేడెక్కింది. సుశీల వివాహం చేసుకుందా? లేదా!! ఎవర్ని చేసుకుంది? ఆ మోహన్‌నా? మరో మదన మోహనుడినా? ఎంతమంది పిల్లలు అనే ప్రశ్నలకు సమాధానాలు తర్కించుకుంటూ నిద్రపోయాను.

• • •

రాధ లేపడంవల్ల లేచి, తెల్లవారిందని గ్రహించాను.

"మీ మనస్సులో ఏదో వుంది. ఎందుకో మథనపడుతున్నారు. నాతో చెప్పకూడదా?" అంది నా కళ్ళల్లోకి చూస్తూ. రాధ చేతుల్ని

నా చేతిలోకి తీసుకుంటూ "ఏం లేదు. నిన్ను గురించే" అన్నాను. అలాటి మాటలు రాధ సుతరాం నమ్మదు. నా చేతులను విడిపించుకుంటూ "ఎందుకు? తెల్లారుతూనే అబద్ధాలాడుతారు? చెప్పకపోతే నన్ను చంపుకు తిన్నట్టే" అంది. ఉలిక్కిపడ్డాను. "మనుష్యుల్ని చంపుకుతినడంఅంటే అంత తేలిక కాదు. అందులో పెళ్ళాన్ని ఎవరైనా చంపుకుతింటారా?" అన్నాను.

"అయితే చెప్పండి" అంది మడతకుర్చీ చెయ్యిమీద కూర్చుంటూ.

"ఇప్పుడుకాదు. కాఫీ లయ్యాక" అన్నాను నేను.

కాఫీ లయ్యాయి.

"చెప్పండి" అంది పట్టుదలతో.

"చెప్పనా? బ్రహ్మాండమైన ప్రేమకథ" అన్నాను నేను సీరియస్‌గా.

"బోదురూ. ఎప్పుడూ వేళాకోళమేనా" అంది.

"కాదు. నిన్ను పెళ్ళి చేసుకునేముందు ఒకమ్మాయిని ప్రేమించాను. ఆకథ" అన్నాను.

రాధ ముఖంలో నవ్వు మాయమయ్యింది. ముఖం నయాపైసా అంత చేసుకుంది.

"అదే! అందుకే చెప్పనన్నాను" అన్నాను.

"లేదు, చెప్పి తీరాలి" అంది.

అంతా చెప్పాను.

"నీ అభిప్రాయం చెప్పు" అన్నాను.

రాధ చిన్నగా నవ్వింది.

"అభిప్రాయానికి ఏముందని ఒక. చిన్న విషయంమీద మమతలు ఎలా చంపుకున్నారో నాకు బోధపడలేదు. మీతత్వమే అంత. ఏమీ లేనిదానికి కూడా కొండంతగా ఆలోచిస్తారు" అంది. మనశ్శాస్త్రవేత్తలాగ.

"అవును" అన్నాను.

"మళ్ళీ - వాళ్ళ నాన్నగారు వచ్చి వెళ్ళాక ఆమె రావడం కానీ వుత్తరం రాయడం కాని, చెయ్యలేదా" అంది రాధ.

"లేదు మన పెళ్ళి శుభలేఖ రిజిస్టర్డు పోస్టులో పంపాను. దాంతోకాని, నా కసి తీరలేదు" అన్నాను.

రాధ యింకేమీ సమాధానం చెప్పలేదు.

● ● ●

ఆఫీసులో ఎవరితోనో మాట్లాడుతుండగా ఫోన్‌కాల్ వచ్చింది. "వన్మినిట్" అని చెప్పి ఫోనుతీసి "హలో రాజుహియర్" అన్నాను.

"సుశీల మాట్లాడుతున్నది" అంది అవతలి కంఠం. అది ఆపరేటరు కంఠం. అరకంగా చెప్పడం ఆ ఆపరేటరుకి ఒక హాబీ.

సుశీల పేరు వినడంతో నేను వులిక్కిపడ్డాను. ఇంతలో సుశీలకంఠం శ్రావ్యంగా వినిపించింది.

"నమస్కారమండి" అంది. ఆ కంఠం ఎంతో పరిచయంవున్న కంఠం. హాయిగా ఒకానొక కాలంలో తీయని కలలకు రూపం దిన కంఠం.

"నమస్కారం" అన్నాను నేనూ పొడిగా.

"మీ కభ్యంతరం లేకపోతే మెరీనాబీచ్ దగ్గరకు సాయంకాలం ఒకసారి రావాలి. నేనే మీ ఆఫీసుకి వద్దామనుకున్నాను. కానీ ఎన్నడూ రాలేదుకదా అని జంకాను. ఏం? వస్తారుకదూ" అంది.



సుశీల గొంతులో ఒక ఆజ్ఞ వుంది. వస్తారా అని అడిగినా అది ఆజ్ఞే.

"తప్పక వస్తాను" అన్నాను.

"థాంక్యూ" అంది.

ఫోను క్లిక్‌మంది.

● ● ●

నాకోసం చూస్తున్న ఆమెను చప్పున చూశాను. తెల్లటి సిల్కుచీర, అంతకన్న తెల్లటి రవిక తొడిగింది. జుట్టు చక్కగా ముడిచుట్టి, సిగమీద మల్లెపూలు పెట్టుకుంది. కుడిచేతికి మేల్స్ వాచ్ వుంది. ఎడంచేతికి ఒక బంగారం గాజుంది.

"ఇలా కూర్చుందామా" అంది నన్ను చూస్తూనే.

"ఆహా" అన్నాను.

ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాము. ఆమెనుచూస్తుంటే నాకళ్లలోగతంమరోసారి గిర్రున తిరిగింది. ఆనాడు నాముందు చిలిపిగా, చక్కగా మాట్లాడిన ఆ సుశీలవేరు. గంభీరంగా కూర్చుని, ఇసకలో గీతలు గీస్తున్న యీ సుశీల వేరు.

"మీ భార్యని చూడాలనివుంది" అంది సుశీల వున్నట్టుండి.

"ఏం?" అన్నాను నేను.

"ఏమో! అలాటివాటికి సమాధానం చెప్పలేనని యిదివరకే చెప్పాను. బెండకాయకూర నీకెందుకే అంత యిష్టం అని అడిగిన అమ్మమ్మ లేదు యీనాడు. కానీ, నాటికి నేటికీ ఆమె ప్రశ్నకి సమాధానం నా దగ్గరలేదు." అంది.

నేను సుశీలకేసి చూశాను. అయిదేళ్ళ క్రితం సుశీలకి, యీనాడు నా యెదురుగా కూర్చుని వున్న సుశీలకి తేడామాయమైంది. కాకపోతే మనిషి అప్పటికన్నా కొంత నాజూకు తేలింది.

"ఎంతమంది పిల్లలు యిప్పుడు" అంది గాలికి ఎగిరే పైటకొంగును అదుపులో పెట్టుకుంటూ.

"పిల్లలు యింకా లేరు." అన్నాను నేను కొంచెం బాధపడుతూనే.

"చాలా అదృష్టవంతులు. అయితే మీకింకా సమస్యలు పుట్టలేదన్నమాట" అంది.

నవ్వేసి వూరుకున్నాను.

"ఇంతకీ నే నడిగినదానికి సమాధానం చెప్పనేలేదు. మీ ఆవిణ్ణి చూపించరా? నిన్న సినిమాహాల్లో, చూశాను. కానీ, ఆమెను పలకరించాలి-మాట్లాడాలి అనే కోర్కె తీరలేదు" అంది.

ఇసకలోంచి లేచి నిలబడుతూ "అయితే వెడదాం పదండి" అన్నాను. సుశీలకూడా లేచి నిలబడింది. ఇద్దరం మౌనంగా నడక ప్రారంభించాము.

"మా ఆవిణ్ణి చూపించాలంటే ఒక్క షరతు" అన్నాను నేను నడకమాని నిలబడుతూ. సుశీలకూడా ఆగి "ఏమిటది?" అంది.

"మీ వారినికూడా నాకు పరిచయం చెయ్యాలి" అన్నాను.

ఆ మాటతో ఆమె ముఖంలో విచిత్రమైన మార్పువచ్చింది. తల దించేసుకుంది. రెండు నిముషాలు మౌనంగా గడిచాయి.

"మీ కోర్కె చెల్లించలేను" అంది చాలా నెమ్మదిగా.

"ఏం?" అన్నాను నేను విషయం అర్థంగాక.

ఆమె తలెత్తి నాకేసి చూసింది. కళ్ళ వెంట నీరు ధారగా కారుతోంది. ఎడమచేతి చూపుడువేలు నా కేసి చూపించింది. ఆపుకుందామని విశ్వప్రయత్నం చేసినా ఆమె దుఃఖం ఆగలేదు.

నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను.

ఆ నాడు నేను వాళ్ళింట్లో విసిరేసిన నా వుంగరం!

నా తల కొట్టేసినట్లయ్యింది.

ఆమె ముఖంలోకి చూడలేక, తల దించేసుకున్నాను.

"మనస్సు నివ్వడం, మనసారా ప్రేమించడం అనేది ఒక్కసారే జరుగుతుంది. అది నా జీవితంలో అయిపోయింది...." అంటూ నిలుచున్నచోటే నెమ్మదిగా కూర్చుంది. నేనూ కూర్చున్నాను.

వాళ్ళ నాన్నగారు నాచేత పరాభవింపబడి, యింటికి వెళ్ళి తనను అనరాని మాటలు అన్నసంగతి, తమ పెళ్ళాడనని తల్లితో తెలియజేశాక, ఆయన మనోవ్యాధితో మంచం పట్టిన సంగతి, చివరికి ఆయన మరణించిన సంగతి నెమ్మదిగా చెప్పింది.

నా హృదయంలో ఎవరో చెయ్యిపెట్టి దేవినట్టయింది. పీక నులుపుకుని చచ్చిపోదామనిపించింది. సుశీల నన్నంతగా ప్రేమించిందని నే నానాడేకాదు, ఈ నాటివరకు వూహించలేదు. కాస్త నిదానించి వుంటే ఏమయ్యేదో! ఆమె భవిష్యత్తుకు, ఆమె తండ్రి చావుకు నేనే కారకుడిని. ఈరకం హంతకులను చట్టం ఏమీ చెయ్యలేదు. అవును, ఏమీ చెయ్యలేదు.

సుశీల కన్నీరు తుడుచుకుని లేచి నిలబడింది. నేనూ యాంత్రికంగా లేచాను.

"మీరంత బాధపడవలసిన పనిలేదు. దైవనిర్ణయం ఏమిటో అది జరిగితీరుతుంది" అందామె.

నా తల సిగ్గుతో వంగిపోయింది. ముందు వెనుకలు ఆలోచించకుండా ఒక అమాయక ప్రాణి జీవితం నాశనం చేశానే అనిపించింది. "తన కోపమే తన శత్రువు అన్నారురా రాజూ! ప్రతీదానికి ముందూ వెనుకా ఆలోచన లేకుండా అంతకోపం తెచ్చుకుంటే, తరువాత పశ్చాత్తాపపడినా ప్రయోజనం వుండదు" అని నా చిన్నతనంలో మేనమామ చేసిన హెచ్చరిక అక్షరాలా నిజమనిపించింది.

"వివాహం అనేది నా జీవితపథంలోంచి ఏనాడో పోయింది. ఇక నా కున్నది - నా వృత్తి ధర్మం అంతే" అందామె తడిఆరిన గొంతుతో.

నేను నిల్చున్నచోటే వుండిపోయాను. అమాంతం గొంతు నులుపుకుని చద్దామన్నంత ఆవేశం కలిగింది.

"సుశీలా! నేను దుర్మార్గుణ్ణి-మూర్ఖుణ్ణి నన్ను క్షమించు" అన్నాను. ఏడుద్దామనుకున్నా కంటివెంట ఒక్కచుక్కయినా నీరు రాలేదు.

సుశీల నిస్పృహగా నవ్వింది.

"అంత మాటనకండి. విభిన్న తత్వాలున్న వాళ్ళ దాంపత్యజీవితం ఎప్పుడూ సుఖంగా జరగదు. ఒకరకంగా మన వివాహం జరగక పోవడమే మంచిది. అన్నట్టు రాధతో మీకెలా వివాహమైంది?" అని నాముఖంలోకి చూసి, "పేరెలా తెలుసనా, ఆశ్చర్యపడుతున్నారు? రిజిస్టర్డు పోస్టులో వచ్చిన శుభలేఖలో విషయం



ఆమాత్రమయినా గుర్తు వుండదా" అంది కన్నీరు తుడుచుకుని నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"అవును" అన్నాను నేను.

"చెప్పండి" అందామె.

రాధ మా ఆఫీసులో టైపిస్టు వుద్యోగం కోసం వచ్చినట్టు, తలిదండ్రులులేక, మేనత్త వద్దిలో పెరిగిన ఆమెగాథ విని జాలిపడి వుద్యోగం యిచ్చిన వైనం, వారం తిరగకుండా రాధకి దిక్కు అయిన మేనత్త కూడ చనిపోయిన నాడు రాధని వివాహం చేసుకోడానికి నిశ్చయించుకుని, మరోవారం తిరిగేలోగానే వివాహం చేసుకున్నట్లు చెప్పాను.

"రాధ చాలా అదృష్టవంతురాలు. మీ వంటివారిని భర్తగా పొందింది" అంది సుశీల.

"అనే అనుకుంటోంది రాధకూడా! కానీ నేనెంత మూర్ఖుణ్ణో, ఎంత అహంకారినో నీకథ విన్నాకూడా ఆమె గ్రహించలేదు, అది విచిత్రం" అన్నాను.

"అందుకనే రాధ అదృష్టవంతురాలని అన్నాను" అంది మళ్ళీ.

"అవునేమో!" అన్నాను నేను.

ఇద్దరం మౌనంగా కారెక్కాము. కారులో మళ్ళీ, నేను రాధని ఎంత విచిత్ర పరిస్థితుల్లో కలుసుకున్నదీ, వివాహం చేసుకున్నదీ చెప్పాను. సుశీల చాలా ఆనందంగా వింది. మరి కాస్సేపు ఏదోఏదో మాట్లాడి "డాక్టర్ మోహన్ ఎక్కడున్నాడు?" అన్నాను తీరా అడిగాక, ఆ ప్రశ్న ఎంత తెలివితక్కువ ప్రశ్నో, ఆమెను ఎంత బాధపెట్టే ప్రశ్నో తెలిసింది. నా తెలివితక్కువతనానికి ఛిఛి అనుకున్నాను. కాని, సుశీల ఏమీ బాధపడినట్లు కనబడలేదు. అతను గుంటూరులో వుంటున్నాడని, ఇద్దరుపిల్లల తండ్రి అయ్యాడని చెప్పింది.

కారు ఇంటిముందు ఆపేసరికి రాధ బయటకువచ్చింది. కారు దిగి నేను రాధకి ఎదురువెళ్ళేసరికి సుశీల కారు దిగి మెట్ల దగ్గరకు వచ్చింది. నేను రాధ నుద్దేశించి "ఈవిడే డాక్టర్" అనగానే "సుశీల" అని రాధ పూర్తిచేసింది.

"మీ ఆవిడ చాలా తెలివైనది" అంది సుశీల రాధభుజంమీద చెయ్యివేసి తట్టుతూ. రాధ సిగ్గుతో తలదించుకుంది

"సామాన్యమయిన తెలివికాదు. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టగలదు. ఛస్తున్నాను మధ్య నేను" అన్నాను.

---

● అప్పారావు : "హల్లో, ఒక్క అయిదు...."

డబ్బారావు : "కానీ కూ...."

అప్పారావు : "....నిమిషాలు నీతో మాట్లాడాలోయ్"

డబ్బారావు : "....ర్చో ఆ కుర్చీమీద."

''చాల్లెండి'' అంది రాధ క్రీగంట చూస్తూ.

ముగ్గురం కలిసి అరగంటసేపు కబుర్లు చెప్పుకున్నాము. తర్వాత రాధ కాఫీ పట్టు కొచ్చి యిచ్చింది. కాఫీ త్రాగాక, ''వస్తాను' అంటూ సుశీల లేచింది.

''భలేవారు. భోజనం చెయ్యకపోతే వదుల్తుందనుకున్నారా యీ చెల్లెలు'' అంది రాధ సుశీల చెయ్యిపుచ్చుకుని. ఆమాటతో రాధ మనస్సు యెంత నిర్మలమో నాకు మరింత చక్కగా అర్థమయింది.

''భోజనం పెడతానంటే వద్దంటానా ?'' అంటూ సుశీల కూర్చుంది.

రాత్రి భోజనాలు అయాయి మరి కాసేపు కబుర్లయ్యాక "వెళ్ళమనే లోగా వెడితే మంచిదనే సామెత వుంది. కనుక వెళ్ళొస్తాను, ఏం రాధా" అంది సుశీల.

"మళ్ళీ వస్తానంటేనే వెళ్ళనిచ్చేది" అంది రాధ.

"అహా ! వచ్చేనెల పదో తారీకున యీ వూరు రావాలి. అప్పుడు మీరు వద్దన్నా మకాం మీ యింట్లోనే" అంది సుశీల.

రాధ తృప్తిగా నవ్వింది.

డ్రైవరు కారు తీసుకువచ్చాడు. సుశీల కారులో ఎక్కింది. "వస్తాను" అంది మాకేసి చూస్తూ.

"వచ్చేనెల పదవతేదీ తప్పక రావాలి" అంది రాధ.

"ఆ" అంది సుశీల స్టార్టయిన కారు శబ్దాన్ని మించి అరుస్తూ.

కారులో సుశీలని నేనే దింపుదామనుకున్నాను కానీ, ధైర్యం లేకపోయింది. కారు కదిలేదాకా యిద్దరం అలాగే నిలబడ్డాము లోపలకువస్తూ "ఆవిడ ఎంత మంచిదండీ - ఎంతమంచి మనస్సో-మనిషిని చూడగానే ఒక పవిత్రమూర్తిని చూచినట్టు అనిపించింది. నిజంగా మనుష్యుల్లో దేవతలుంటారనడానికి ఆవిడే తార్కాణం" అంది రాధ.

"ఏం ?" అన్నాను నేను హాల్లో కుర్చీలో కూర్చుంటూ.

"ఏమో ! అలా అనిపించింది. ఒక మనిషిని చూడగానే మంచిభావం, మరో మనిషిని చూడగానే చెడ్డభావం కలుగుతుందంటారుకదా-అలాగే నా కావిడ్ని చూడగానే అలా అనిపించింది. నిజంగా ఆ తెల్లటి మస్తుల్లో ఆవిడ కారుదిగేసరికి మూర్తీభవించిన పవిత్రతలా కనుపించింది" అంది రాధ వుపన్యాసధోరణిలో.

రాధది కాస్త వుపన్యాస ధోరణిలో మాట్లాడే స్వభావమే అయినా చాలామటుకు నిజం వుంటుందని లోగడ చాలాసార్లు నేను గ్రహించిన విషయమే !

''ఏమిటాలోచిస్తున్నారు ? ఏం మీకు నే నన్నమాటలు నచ్చలేదా'' అంటూ రాధ నా భుజం పట్టుకుని కుదిపింది.

''ఏంలేదు. నువ్వు ఏది చెప్పినా అది నూరుపాళ్ళు సత్యం-నచ్చకపోవడమేమిటి ? సుశీల నిజంగా దేవతామూర్తి! ఆమె మనస్సే అంత !'' అన్నాను నేను రాధజడ చేత్తో పట్టుకుంటూ.

''మీకున్నకోపం కాస్త తగ్గితే మీరూ అంతే! మీ అంత మంచివారెవరూవుండరు'' అంది.


నిజమే !

నిజమే ! కోపం తగ్గాలి అనుకున్నాను నిశ్చయంగా.

000

జ్యోతి





# భంగవంతం

స్థిరమైన నడవడితోపాటు స్థిరమైన ఇరుగు పొరుగు సఖ్యత 'జనుల కందరకు వలయు' అని పూరాగా నమ్మినవాళ్ళలో భగవంతం ఒకడు.